# శోకదేవి

జ్వలియించు పూవుత్తి పరిమళించెడు మట్టి
దుఃఖిత ప్రణయినీ! తొలగి చను నన్నియును:
సాంధ్య నిస్తబ్ధ తేజస్సు శాంతించు,
విలపించగా మానివేయును గాలి
బ్రదుకొక్క కల్పనా కథవోలె ముగియు.

జీవితంపు గులాబి కావిరేకుల నడుమ
సరళా నిలముగాగ మరణమొక్పుడు వీచు,
బాధావిలానేక వర్షముల్ కడువ
శాంతి నెచ్చెలియట్లు సముఖాన తోచి
జాలిహస్తాల బాష్పమ్ముల తుడుచు.

స్మృతిలోన పధికృపన్ ప్రతి వస్తువున్ ముగియు–
ఆశయు, వలపు, ఈ అలతిమనుజ శ్వాస,
కాంతాధరములు, సిగ్గరి సందెచుక్క,
ఇకముందు మడిసిన విపుడు జీవించి
పరమనోజ్ఞములైన వస్తువులెల్ల.

ఒక తెల్లదగుమంట, ఒక కెంపుమంటయున్
శాంతివేదనల ప్రోజ్జ్వలకల, లా నడుమ
వస్తువుల్ కడచనున్ వచ్చిన దారి
ఇవియెల్ల నడచిపోయిన అనంతరము
ఆత్మ స్వీయోషస్సునందు జ్వలించు.

ఎరుపు మంటకు పైన, తెలుపుమంటకు పైన
నీడయే లేని ఉన్నతజాతి తేజమ్ము
మనుజ ఘోషల కందుకొనరాని నిభిడ
నిశ్శబ్దమున నున్న నక్షత్రవీధి
నేకాంత రాజ్యమ్ము నేలు సమ్రాట్టు.

---

మూలం: హరీంద్రనాథ చటోపాధ్యాయ    అనువాదం: శ్రీ. శ్రీ.

దుఃఖిత ప్రణయినీ! తొలగి చను నన్నియును-
నా తీవ్రభావపుంజ్వలిత ప్రసూనమ్ము,
నీ యతిక్షీణతనువు తీయనిమట్టి;
మన ప్రేమ దేనికొమ్మలు కాంచెనట్టి
మనకయా జీవనోన్మాదంపు తరువు.

తొలగు నన్నియు ఒక్క తుదిఅరపులోన:
నీరమ్ము, హారిణమ్ము, నీవు నేనును కూడ;
అలసముల్ ప్రాకు నీడలు మనమీద!
కలలెరుంగని, అమోఘు, మగాధమైన
ఒంటరి నిద్రలో నొరగును బ్రదుకు.

నిష్ఠురాహత హృదీ! నీ కేడ్వనికేల?
బేల కనులార! మీకేల అశ్రువులు మీ
బాధారహస్య గహ్వరములందుండి?
ఆనందమికమీద, వాన విధాన
గతియించి మగిడి రాగలుగరు మీరు.

# మానవత్వానికే దూరమౌతూన్నాం

కొత్తపల్లి లలిత

ఏ మానవ సంఘం అయినా అభివృద్ధి పొంది ఉత్తమ నాగరికతను సృష్టించాలంటే, శాస్త్రజ్ఞానం, పారిశ్రామికాభివృద్ధి, నైతిక దృష్టి, కావాలి. నాగరికత అనే సౌధం ఈ స్తంభాల మీదనే నిలిచి ఉంటుంది. నవీన ప్రపంచంలో శాస్త్రాభి వృద్ధి, పారిశ్రామికాభి వృద్ధి జరుగుతున్నంత వేగంగా నైతిక దృష్టి అభివృద్ధిపొందక పోవడమే ఆధునిక ప్రపంచంలోని చాలా లోపాలకు మూలం అనడం సత్యదూరం కాదు. ఉరకలువేస్తూ పరుగులు పెడుతూన్న నేటి శాస్త్రాభివృద్ధి, మానవుడికి ప్రకృతి శక్తులను చేతిలో పెట్టింది. ప్రాక్తన మానవుడు కని విని ఎరుగని - ఊహించ లేని అద్భుత శక్తుల్ని నేటి శాస్త్రాభివృద్ధి మానవునికి ప్రసాదించి, అతన్ని సింహబలుణ్ణి చేసింది. ఆ బలాన్ని సక్రమ మార్గాల్లో నడిపించడానికి తగిన నైతిక శక్తి లేని నేటి మానవుడు, ఆ శక్తిని దుర్వినియోగంచేస్తూ తనకు తానే హాని చేసుకుంటున్నాడు. తానున్న కొమ్మను తానే నరుక్కొంటున్నాడు. ఈ ఆత్మహత్య మానవుని లోపం చేతనేగాని శాస్త్రంయొక్క లోపం చేత కాదు.

ముఖ్యంగా, రాజకీయవేత్తల చేతులలో పడి ఈ శాస్త్ర విజ్ఞానం అంతా - అజ్ఞానంగా మారి-మానవుని మృతికి తోడ్పడుతోంది. వీళ్ల చేతులలో పడ్డ ఈ విజ్ఞానం, పీడిత ప్రజానీకానికి విముక్తిని తేవడానికి బదులు ఇంకా పీడిస్తోంది, మానవుని శృంఖలాలు తెగగొట్టడానికి బదులు, ఆతన్ని ఇంకా శృంఖలాలలో గట్టిగా బంధిస్తోంది. ఇది ఎప్పటినుండో జరుగుతున్నదే. అందుచేతనే ఓ నవ కవి,